# భరోసా లేని ప్రజావాణి

కాంగ్రెస్ సర్కారు వైఖరిపై ప్రజల్లో నిరసన పెల్లుబుకుతుందనడానికి శుక్రవారం ప్రజాభవన్‌కు తరలివచ్చిన వందలాది మందే సాక్ష్యం. ఆరు గ్యారెంటీల ఆశచూపి అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా వాటిని పూర్తిగా ఎందుకు అమలుచేయడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. హామీలను అమలుచేయాలని తెలంగాణ ఉద్యమకారులు, చిన్న కేసుల్లో క్లీన్‌చిట్ పొందినా తమకు అపాయింట్‌మెంట్ ఎందుకివ్వడం లేదని పోలీస్ అభ్యర్థులు, గ్రామీణ అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని జీవో 46 బాధితులు ప్రజాభవన్ వద్ద నిరసన తెలిపారు. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు వందలాది మంది తరలిరాగా, ఒక్కరోజే 472 వినతులు అందజేయడం గమనార్హం. రెవెన్యూ శాఖకు 107, సివిల్ సప్లయ్‌కు64, విద్యుత్తుకు 59, సోషల్ వెల్ఫేర్‌కు 31, మైనార్టీ వెల్ఫేర్‌కు 26, ఇతర విభాగాలకు 165 చొప్పున అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

## • దివ్యాంగుడి వినూత్న నిరసన



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మర్రిపల్లి రాజగంగారం అనే దివ్యాంగుడు తన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ప్రధాన ద్వారానికి అడ్డంగా పడుకొని వినూత్న నిరసన తెలిపాడు. అనంతరం ద్వారం మూసేసి కొద్దిసేపు బైఠాయించాడు. తన ఇంటికి రోడ్డు, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అన్నాడు. అధికారుల హామీతో నిరసన విరమించాడు. – మల్లాపూర్



మీడియాతో మాట్లాడుతున్న కామారెడ్డి జిల్లా బాన్సువాడ మలిదశ ఉద్యమకారులు

## మళ్లీ ప్రజాభవన్ మెట్లెక్కిన తొలి అర్జీదారులు

- 8 నెలలైనా సమస్య పరిష్కారం కాలేదన్న ఉద్యమకారులు

ప్రజాభవన్, ఆగస్టు 2: ప్రజాభవన్‌లో స్వీకరించిన తొలి అర్జీ 8 నెలలు గడిచినా తీరలేదనడానికి ఇదే నిదర్శనం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీల్లో తెలంగాణ ఉద్యమకారుల గ్యారెంటీని వెంటనే అమలు చేయాలని కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ మలిదశ ఉద్యమకారులు ప్రజాభవన్ ప్రారంభమైనప్పుడు తొలి అర్జీ పెట్టుకున్నారు. అది నేటికీ పరిష్కారానికి నోచలేదు. దీంతో శుక్రవారం మళ్లీ ప్రజాభవన్‌కు వచ్చారు. నెలలు గడిచినా తమకిచ్చిన గ్యారెంటీ ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. 8 నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కోసం వేచి చూస్తున్నామని తెలిపారు. ఉద్యమకారులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మలిదశ ఉద్యమకారులకు తక్షణమే ఇండ్లస్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.




ప్రజా భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

## కానిస్టేబుల్ అభ్యర్థుల నిరసన

ప్రజాభవన్, ఆగస్టు 2: మర్డర్, పోక్సో కేసుల్లో ఉన్న వారికి నియామక ఆర్డర్ కాపీలిచ్చి చిన్న కేసుల్లో క్లీన్‌చిట్ పొందిన తమకు ఎందుకు ఇవ్వలేదని కానిస్టేబుల్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ నియామకాలు–2022లో ఎంపికై పలు కేసుల కారణంగా నియామకాలు నిలిపివేయడంతో శుక్రవారం వివిధ జిల్లాల నుంచి ప్రజాభవన్‌కు తరలివచ్చి నిరసన తెలిపారు. తాము ఇప్పటి వరకు కలిసిన వారి ఫొటోలతో ఉన్న బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల తీరుపై విరుచుకుపడ్డారు. తామేమైనా మర్డర్ కేసుల్లో ఉన్నామా? రేప్ కేసుల్లో ఉన్నామా? చిన్న చిన్న పెట్టీ కేసుల్లో ఉన్న తమపై పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు కొట్టివేసిన కానిస్టేబుల్ అభ్యర్థులకు వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి శిక్షణకు పంపాలని డిమాండ్ చేశారు. కేసుల కారణంగా 326 మందిలో 158 మందికి ఆర్డర్ కాపీలిచ్చి మిగతా వారికి ఇవ్వలేదని, ఇది అనుమానాలకు తావిస్తుందని అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. టీఎస్‌ఎల్‌పీఆర్బీ చైర్మన్ 326 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని, మిగతా 168 డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులందరికీ రోజురోజుకూ ఆర్థిక ఇబ్బందులు తీవ్రమవుతున్నాయని ఆవేదన చెందారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

## • గ్రీన్‌ఫీల్డ్ బాధిత రైతుల అరెస్టు



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ, ఏనుగల్లు గ్రామాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంతో తమ జీవనాధారమైన వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులు పలువురు శుక్రవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఈక్రమంలో ముందస్తుగా బాధిత రైతులను శుక్రవారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. – పర్వతగిరి



ప్రజాభవన్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగిన జీవో నంబర్ 46 బాధితులు

## జీవో నంబర్ 46 బాధితుల ధర్నా

ప్రజాభవన్, ఆగస్టు 2: పోలీస్ నియామక ప్రక్రియలో జీవో నంబర్–46 బాధితులు శుక్రవారం ప్రజాభవన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రెవెన్యూ జిల్లాల జనాభాను ప్రాతిపదికగా చేసుకుని పోస్టులు కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కటాఫ్ మార్కుల్లో వ్యత్యాసం వల్లే పట్టణ ప్రాంత అభ్యర్థులకు ఎక్కువ ఉద్యోగాలు దక్కుతాయని, తద్వారా గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు.

## • పింఛన్లు పెంచాలని బీడీ కార్మికుల ధర్నా



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.4,016కు పెంచాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. బస్టాండ్ నుంచి భారీ ర్యాలీగా వచ్చి ఆఫీస్ ఎదుట బైఠాయించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు. – మోర్తాడ్

# డిగ్రీ ఫెయిలైనోళ్లే ప్రైవేట్ టీచర్లు

- సర్కారు బడుల్లో గత ఏడాది కంటే 2 లక్షల అడ్మిషన్లు తగ్గాయి
- టీచర్లు తేనెటీగల్లాంటోళ్లు.. హాని చేస్తే ఎదురుదాడే
- టీచర్లతో ముఖాముఖి'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న కోదండరాం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ స్కూళ్లల్లో ఇంటర్ పాసైనోళ్లు.. డిగ్రీ ఫెయిలైనోళ్లే పాఠాలు చెప్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సర్కారు స్కూళ్లల్లో పని చేసే వారితో పోల్చితే సగం చదువుకున్నోళ్లే ప్రైవేట్ పాఠశాలల్లో బోధిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ టీచర్లు సర్కారు టీచర్ల కంటే గొప్పవారేమీ కాదని వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో 'నూతనంగా పదోన్నతి పొందిన టీచర్లతో ముఖ్యమంత్రి ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సభలో సీఎం మాట్లాడుతూ 'ఎంఏ, బీఈడీ, డాక్టరేట్ వంటి ఉన్నత చదువులు చదువుకున్నోళ్లు సర్కారు టీచర్లుగా పనిచేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్ పాసైనోళ్లు, డిగ్రీ ఫెయిలైనోళ్లు పాఠాలు చెప్తున్నారు' అని తెలిపారు. టీచర్లు తేనేతుట్టెలాంటివారు అని, వారిని ముట్టుకోవద్దని చాలా మంది సలహానిచ్చారని గుర్తుచేశారు. తమకు హాని చేయాలని చూస్తే తేనేటీగల్లా టీచర్లు ఎదురుదాడిగి దిగుతారని చెప్పిన సీఎం.. టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. విద్యకు రూ.30 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, ఇతర హామీల అమలు దృష్ట్యా తాజా బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు మాత్రమే కేటాయించామని తెలిపారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది కంటే రెండు లక్షలకుపైగా అడ్మిషన్లు తగ్గాయి. 30 వేల సర్కారు పాఠశాలల్లో 26 లక్షల మంది ఉంటే అదే 10 వేల ప్రైవేట్ పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో సర్కారు టీచర్లకంటే గొప్ప టీచర్లున్నారా?' అని ప్రశ్నించారు. రేపే ప్రభుత్వ పాఠశాల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తామని, 30 వేల పాఠశాలలకు ఉచిత విద్యుత్తునిస్తామని, ఈ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని వెల్లడించారు.

### ముఖం చూపించి వెళ్లిపోయారంతే!

టీచర్లతో ముఖాముఖి అని చెప్పి.. సీఎం తమకు ముఖం చూపించి వెళ్లిపోయారని సభకు వచ్చిన పలువురు టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల అసహనం వ్యక్తంచేశారు. తమకు స్పష్టమైన హామీలేవీ ఇవ్వలేదని, కనీసం మమ్మల్ని సభలో మాట్లాడించలేదని, ముఖాముఖి అంటే తమతో మాట్లాడిస్తారని అనుకున్నామని, కనీసం టీచర్ ఎమ్మెల్సీలను కూడా మాట్లాడించలేదని ఓ నేత వాపోయారు.

## ఎమ్మెల్సీ గోరటికి హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ ప్రముఖ కవి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్నపై సైఫాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసు విచారణను హైకోర్టు నిలిపివేసింది. ఈ మేరకు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో వెంకన్న దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం విచారణ జరిపారు. ఎన్నికల నిబంధనలను వెంకన్న ఉల్లంఘించలేదని, రాజకీయ కక్షతో కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో ఈ కేసు విచారణను నిలిపివేయాలని కింది కోర్టుకు స్పష్టం చేసిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు నిమిత్తం ప్రతివాదులైన పోలీసులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను 22కు వాయిదా వేసింది.

## క్రిశాంక్‌కు 41ఏ నోటీసు ఇవ్వండి

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లేలా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారంటూ బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్‌పై నమోదైన కేసులో పోలీసులు బీఎన్‌ఎస్‌ఎస్‌లోని 35 సెక్షన్(సీఆర్పీసీలోని 41(ఏ) సెక్షన్)ను అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఆ సెక్షన్ కింద క్రిశాంక్‌కు నోటీసు జారీ చేసి దర్యాప్తు చేపట్టాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 30న శశిధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు క్రిశాంక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించడంతో శుక్రవారం విచారణ చేపట్టారు. రాజకీయ కక్షతో చేసిన ఫిర్యాదు ఆధారంగా క్రిశాంక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. క్రిశాంక్‌పై మోపిన అభియోగాలు తీవ్రమైనవి కానప్పటికీ ఆయనను అరెస్టు చేసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను, శశిధర్‌రెడ్డిని హైకోర్టు ఆదేశించింది.



108లో విద్యార్థినిని తీసుకెళ్తున్న సిబ్బంది, తల్లిదండ్రులు

## వెంటిలేటర్‌పై గురుకుల విద్యార్థులు

**పాము కాటేసినట్టుగా అనుమానాలు**

ములుగురూరల్, ఆగస్టు 2: ములుగు జిల్లా బండారుపల్లి టీజీ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పదోతరగతికి చెందిన కార్తీక్, ప్రణయ్‌కి అస్వస్థతతో ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి, వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి గూడెప్పాడ్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించినట్టు తెలిసింది. అక్కడ వెంటిలేటర్లపై వైద్యం అందిస్తున్నట్టు తెలిసింది. ప్రిన్సిపాల్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. విద్యార్థులను పాము కాటు వేసిందా? లేదా డ్రగ్స్ తీసుకొని అస్వస్థతకు గురయ్యారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కృష్ణమ్మ పరవళ్లు

- జూరాలకు 2.95 లక్షల క్యూసెక్కులు రాక
- శ్రీశైలానికి 4,42,977 క్యూసెక్కుల వరద




శ్రీశైలం డ్యాం పది గేట్ల నుంచి పరుగులు పెడుతున్న కృష్ణాజలాలు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 2 : కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. శుక్రవారం జూరాలకు 2.95 లక్షల క్యూసెక్కులు చేరగా.. 41 గేట్లు ఎత్తి దిగువకు 2,95,878 క్యూసెక్కులు వదులుతున్నారు. శ్రీశైలం జలాశయానికి 4,42,977 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 10 గేట్లను ఎత్తి 4,66,650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు భారీగా వరద వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం గణనీయంగా పెరుగుతూ శుక్రవారం క్రస్ట్‌గేట్ల లెవల్ 551.30అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టానికి మరో 39 అడుగులు మాత్రమే ఉండగా, రోజుకు 10 టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరుతుండటంతో నిండుకుండలా మారుతున్నది. ప్రస్తుతం సాగర్‌కు 4,89,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 31,864 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 53 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. కాగా జయశంకర్ భూపాలపల్లి మండలంలోని మేడిగడ్డ(లక్ష్మీ) బరాజ్‌కు వరద ప్రవాహం తగ్గుతున్నది. శుక్రవారం 3,30,830 క్యూసెక్కులు రాగా మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సమ్మక్క బరాజ్‌కు 5,48,260 క్యూసెక్కుల వరద వస్తున్నది.

### ఎస్సారార్ @ 12 టీఎంసీలు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 2 : కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–2లో గత నెల 27 నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలతో ఎస్సారార్(మధ్యమానేరు)సగానికి చేరువైంది. 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 12.326 టీఎంసీలు నిల్వ ఉండగా, 14,440 క్యూసెక్కుల వరద వస్తున్నది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది పంప్‌హౌస్ నుంచి శుక్రవారం 4 మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలుతున్నాయి. ఇక్కడి నాలుగు బాహుబలి మోటర్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. గ్రావిటీ కాల్వ ద్వారా 99వ కిలోమీటర్ మైలురాయి వద్ద కలుస్తున్నాయి. అక్కడి నుంచి మధ్యమానేరుకు పరుగెడుతున్నాయి.

## స్కూలు బస్సు చక్రాల కింద నలిగిన చిన్నారి



వరుణ్‌తేజ్ ఐడీ కార్డు

జనగామ, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): స్కూలు బస్సు కింద పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకున్నది. జనగామ మండలం అడవికేశ్వాపూర్‌కు చెందిన వరుణ్‌తేజ్(6) జనగామలోని గౌతమి మోడల్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. రోజూ స్కూల్ బస్సులో వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం స్కూల్ నుంచి గ్రామానికి చేరుకున్న వరుణ్‌తేజ్ బస్సులో నుంచి దిగుతుండగా బ్యాగు తట్టుకొని వెనుక టైర్ కింద పడిపోయాడు. డ్రైవర్ గమనించకుండా నిర్లక్ష్యంగా ముందుకు నడపడంతో బాలుడి తలపై నుంచి టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో విద్యార్థి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందంటూ స్థానికులు, మృతుడి బంధువులు స్కూలు బస్సు అద్దాలు ధ్వంసం చేసి రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని నచ్చజెప్పారు. జనగామ అర్బన్ సీఐ రఘుపతిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిజామాబాద్ జిల్లా రెంజల్‌లోని కెనరా బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## రుణమాఫీ కోసం బ్యాంకు ముట్టడి

**మూడు గంటలపాటు రైతుల ధర్నా**

రెంజల్, ఆగస్టు 2: అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదంటూ రైతులు శుక్రవారం నిజామాబాద్ జిల్లా రెంజల్‌లోని కెనరా బ్యాంకును ముట్టడించి మూడు గంటలకుపైగా ధర్నా చేశారు. స్థానిక కెనరా బ్యాంకులో వేలాది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. క్రమం తప్పకుండా రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడతల్లో కలిపి రూ.లక్షన్నర లోపు క్రాప్ లోన్లను మాఫీ చేసింది. ఆ జాబితాలో తమ పేర్లు లేవని, ఖాతాల్లో డబ్బులు పడలేదని ఆందోళనకు గురైన రైతులు ఆఫీసులు, బ్యాంకు చుట్టూ తిరిగినా సమాధానం దొరకలేదు. ఆగ్రహానికి గురైన రెంజల్, దండిగుట్ట, కునేపల్లి, బాగేపల్లి, వీరన్నగుట్ట, కల్యాపూర్, వీరన్నగుట్ట, అంబేద్కర్‌నగర్, కిసాన్ తండా తదితర గ్రామాల రైతులు కెనరా బ్యాంక్ ఎదుట బైఠాయించారు. తమ రుణాలను తక్షణమే మాఫీ చేయాలని, లేకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ వచ్చి అర్హులందరికీ న్యాయం చేస్తామని, రెండ్రోజులు గడువు ఇవ్వాలని కోరడంతో వారు శాంతించారు.



నిర్మల్ జిల్లా సోన్‌లోని ఇండియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

## మా రుణమాఫీ సంగతి ఏంది సారూ!

- 900 మందికిగాను 204 మందికే మాఫీ
- ఇండియన్ బ్యాంకు మేనేజర్‌ను నిలదీసిన రైతులు

సోన్, ఆగస్టు 2 : ప్రభుత్వం రెండు విడతలుగా రుణమాఫీ చేసినా తమ పేర్లు లిస్టులో ఎందుకు లేవు? అని రైతులు శుక్రవారం నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకు పరిధిలో మొత్తం 900 మంది రుణాలు తీసుకోగా 204 మందికే మాఫీ జరిగిందన్నారు. రుణమాఫీపై వ్యవసాయశాఖ అధికారులకు ప్రభుత్వం ఓ యాప్ అందుబాటులోకి తెచ్చినా అందులో కూడా తమ వివరాలు లేవని వాపోయారు. బ్యాంకు అధికారులు వెంటనే స్పందించి బ్యాంకులో తీసుకున్న రూ. లక్షా యాభై వేల రుణాల జాబితాను ప్రభుత్వానికి పంపి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

### లక్ష రుణం మాఫీ కాలె



నేను సోన్‌లోని ఇండియన్ బ్యాంకులో పదేండ్ల నుంచి వ్యవసాయ రుణం తీసుకుంటున్నా. నిరుడు లక్ష రుణం తీసుకున్నా. ప్రభుత్వం మాఫీ చేస్తదని ఎంతో సంబురపడ్డా. కానీ లిస్ట్‌లో నా పేరు లేదు. అధికారులను అడిగిన సరైన సమాధానం చెప్తలేరు. నా రుణం మాఫీ చేసి న్యాయం చేయాలి.

–దాసరి రాజేందర్, మం:సోన్, జిల్లా: నిర్మల్

### రుణ మాఫీ చేయాలి..



నేను సోన్‌లోని ఇండియన్ బ్యాంకులో గతేడాది రూ.లక్ష రుణం తీసుకున్న. ప్రభుత్వం ఒకటి, రెండో విడతలుగా రుణాలు ఇప్పటివరకు రూ.లక్షన్నర వరకు మాఫీ చేసింది. కానీ నాకు మాఫీ కాలేదు. ఎందుకు కాలేదో అర్థమైతలేదు. అధికారులు నా రుణం మాఫీ అయ్యేలా చూడాలి.

–ఆకుల ముత్తన్న, రైతు, సోన్, నిర్మల్ జిల్లా

## రుణమాఫీలో విచిత్రాలెన్నో..

**రూపాయి, 5 రూపాయలు మాఫీ • జాబితాలో సవాలక్ష లోపాలు**

రంగారెడ్డి, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): రుణమాఫీ పథకంలో రంగారెడ్డి జిల్లాలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఆశగా మాఫీకోసం ఎదురు చూసిన రైతులకు అడుగడుగునా చిక్కులే ఎదురవుతున్నాయి. జాబితాలో సవాలక్ష లోపాలు వెలుగుచూస్తున్నాయి. చేవెళ్ల మండలం చనువెల్లికి చెందిన ఓ రైతుకు రూపాయి మాత్రమే మాఫీ అయింది. సదరు రైతు రూ.లక్షలోపు తీసుకున్న రుణం మొదటి విడతలోనే మాఫీ కాగా.. రెండో విడత జాబితాలో రూపాయి మాఫీ కావడం విస్తుగొలుపుతున్నది. ఇదే మండలానికి చెందిన మరో రైతు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని మొత్తం తీర్చేశాడు. బ్యాంకులో ఎటువంటి అప్పులేకపోగా.. రూ.5 మాఫీ అయినట్టు జాబితాలో చూపిస్తున్నది. ఇటువంటి విచిత్రాలు రంగారెడ్డి జిల్లాలో రుణ జాబితాల్లో కోకొల్లలుగా ఉన్నాయి. ఇందుకు గల కారణాలపై అటు బ్యాంకుల అధికారులుగాని, వ్యవసాయ అధికారులు గాని స్పష్టత ఇవ్వకపోవడంతో రుణమాఫీ జాబితాపై గందరగోళ పరిస్థితి నెలకొన్నది.

## వడ్డీ కడితేనే అసలు మాఫీ

**ప్రభుత్వ షరతులతో రైతుల ఇబ్బందులు**

వికారాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల లోపు పంట రుణాలకు సంబంధించి అసలుతోపాటు వడ్డీని కూడా మాఫీ చేస్తున్నామని చెబుతున్నా వికారాబాద్ జిల్లాలోని పలు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాల్లో కేవలం అసలు మాత్రమే మాఫీ అవుతున్నట్టు రైతులు చెబుతున్నారు. 9 డిసెంబర్ 2023 లోపు ఉన్న పంట రుణాలకు సంబంధించి అసలుతోపాటు మిత్తీని మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవానికి మాత్రం వడ్డీ చెల్లిస్తేనే రుణమాఫీ అవుతుందని, రైతుల నుంచి ముక్కు పిండి వడ్డీ డబ్బులను బ్యాంకర్లు వసూలు చేస్తున్నారు. సదరు బ్యాంకర్లు వడ్డీతో కలిపి కాకుండా అసలు రుణాల జాబితాను పంపడంతోనే వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరంగల్ జిల్లా నల్లబెల్లి పీఏసీఎస్‌లో విచారణ చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్

## రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేస్తాం

**జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్**

నల్లబెల్లి, ఆగస్టు 2: ఆధార్ నమోదు తప్పిదంతో రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేస్తామని వరంగల్ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్ హామీ ఇచ్చారు. 'ఒకరి ఆధార్.. మరొకరికి రుణం' శీర్షికన జూలై 31న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని డీసీసీబీ, కేజీబీ, యూనియన్ బ్యాంకులో జరిగిన ఆధార్ తప్పిదాలపై జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ శుక్రవారం విచారణ చేపట్టారు. పీఏసీఎస్ కార్యాలయంలో క్రాప్‌లోన్ తీసుకున్న రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారుల తప్పిదం వల్ల 12 మంది రైతుల ఆధార్ నంబర్లు ఒకరివి మరొక రైతుకు నమోదు చేయడం వల్ల రుణమాఫీకి అనర్హులైనట్టు తెలిపారు. ఆధార్‌లో తప్పిదం వల్ల రుణమాఫీ వర్తించని ప్రతి రైతు సంబంధిత బ్యాంకుకు వెళ్లి వివరాలను 32 ఫార్మాట్‌లో నమోదు చేయించాలని సూచించారు.